## బీసీ కుల గణనను మళ్లీ చేపట్టాలి



మంచిర్యాలటౌన్, ఫిబ్రవరి 5 : కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు చేసినటువంటి కుల గణనను రద్దుచేసి తిరిగి మళ్లీ బీసీ జన కుల గణనను చేపట్టాలి. కుల గణన పేరిట కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ ప్రజలను మోసం చేసింది. కుల గణనను శాస్త్రీయంగా చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన బీసీ కుల గణన తప్పుల తడకగా ఉంది. గత ప్రభుత్వాలు చేసిన లెక్కల ప్రకారం పోలిస్తే బీసీలను ఇప్పుడు తక్కువ చేసి చూపిస్తున్నారు. ఇదే సమయంలో ఓసీల జనాభా పెరిగినట్లు చూపిస్తున్నారు. దీని వెనక పెద్ద కుట్ర దాగి ఉందన్న అనుమానాలు తలెత్తుతున్నాయి. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్‌ను కాపాడుకునే ప్రయత్నంలో భాగంగా అగ్రవర్ణాల ప్రభుత్వం కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నది. మళ్లీ సమగ్రంగా బీసీ కులగణన జరిపించాలి. అదికూడా శాస్త్రీయంగా ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. వాస్తవ లెక్కలు బయటపెట్టి ప్రభుత్వానికి బీసీలపై ఉన్న నిబద్ధతను నిరూపించుకోవాలి.

**- నరెడ్ల శ్రీనివాస్, బీసీ సమాజ్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు**

## 21 లక్షల బీసీలు ఏమయ్యారు?



ఇచ్చోడ, ఫిబ్రవరి 5 : బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వేనే నిజం. తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహించిన బీసీ కుల గణన సర్వేలో 21 లక్షల మంది బీసీలు ఏమయ్యారు. బీసీల గణనను కాంగ్రెస్ ప్రభుత్వం తప్పుల తడకగా రూపొందించింది. ఎన్యుమరేటర్లు అరకొర సమాచారం సేకరించారు. ప్రభుత్వం ముందస్తుగానే కులం వివరాలు చెప్పకపోయిన పర్వాలేదంది. దీంతో బీసీల సంఖ్య తక్కువ వస్తుందని అనుమానం.

**- బలగం రవికుమార్, గేర్జం, బీసీ నాయకుడు**


## బీసీ కుల గణనపై అనుమానాలు



ఇచ్చోడ, ఫిబ్రవరి 5 : కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహించిన బీసీ జనాభా గణనలో ఇటీవల విడుదల చేసిన నివేదికపై అనుమానాలు ఉన్నాయి. గ్రామ, మండల స్థాయిలో కులగణన సక్రమంగా జరగలేదు. తప్పుడు సర్వేతో బీసీలు నష్టపోతున్నారు. తాజాగా ప్రభుత్వం వెల్లడించిన కుల గణన సర్వే జాబితా తప్పుల తడకగా ఉంది. కాంగ్రెస్ ప్రభుత్వం మరోసారి సర్వే నిర్వహించి కచ్చితమైన సంఖ్య ప్రకటించాలి.

**- ఎర్రగొల్ల రాజన్న యాదవ్, సిరికొండ**

# చేతులెత్తేశారు..






- ఎన్నికలకు ముందు 42 శాతం రిజర్వేషన్లు అంటూ హామీ
- ఇప్పుడేమో కేంద్ర ప్రభుత్వం సమ్మతించాలంటూ మెలిక
- బీసీ రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించే అంశంపై సందిగ్ధం
- రాహుల్‌గాంధీ ఇచ్చిన డిక్లరేషన్ హామీ అబద్ధమేనా?
- కాంగ్రెస్‌వి మోసపూరిత హామీలు అంటూ మండిపాటు
- మాకు అన్యాయం జరిగితే ఊరుకునేది లేదంటున్న బీసీలు

మంచిర్యాల, ఫిబ్రవరి 5(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : తెలంగాణలోని బీసీలకు అధికార కాంగ్రెస్ పార్టీ ఘోరంగా మోసం చేసింది. ఎన్నికలకు ముందు బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామంటూ రాహుల్‌గాంధీ సమక్షంలోనే బీసీ డిక్లరేషన్ చేసింది. కానీ.. అన్ని హామీల మాదిరిగానే బీసీలకు ఇచ్చిన మాటపై నాలుక మడతేసింది. రాజ్యాంగబద్ధంగా రిజర్వేషన్లు కల్పిస్తామని గెలిచిన నాటి నుంచి ఊరించి ఇప్పుడు ఉసూరు మనిపించింది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల పెంపుపై అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపిస్తామని, ఒప్పుకుంటే అమలు చేస్తామంటూ చేతులు ఎత్తేసింది. కేంద్రం ఆమోదించకపోతే పార్టీ పరంగా రిజర్వేషన్ల వాటా కల్పిస్తామంటూ సీఎం అసెంబ్లీ సాక్షిగా ప్రకటించారు. ఒక్కమాటలో చెప్పాలంటే తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీని కేంద్ర ప్రభుత్వంపైకి నెట్టి చేతులు దులుపుకుంది. దీనిపై బీసీ సంఘాల నాయకులు భగ్గుమంటున్నారు. రాహుల్‌గాంధీ చెప్పింది అబద్ధమేనా? అని మండిపడుతున్నారు. రైతు బంధు, రైతుభరోసా విషయంలో రైతులను మోసం చేసినట్లే బీసీలను మోసం చేస్తుందంటూ ఆరోపిస్తున్నారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీలన్నీ బూటకమేనని అంటున్నారు.

### పార్టీ పరంగా వాటాతో ఒరిగేదేం లేదు

మొన్నటి వరకు రాజ్యాంగబద్ధంగా రిజర్వేషన్లు కల్పిస్తామని చెప్పి.. ఇప్పుడు పార్టీ పరంగా వాటాకు సిద్ధమని కాంగ్రెస్ పార్టీ చెప్తున్నది. కానీ.. దానితో ఒరిగేదేం లేదని బీసీ సంఘాలు అంటున్నాయి. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై చట్టబద్ధత కల్పించకుండా పార్టీ పరంగా వాటా ఇస్తామనడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. ఈ ఎన్నికల్లో వాటా కల్పిస్తారు. వచ్చే ఎన్నికల్లోనూ ఇదే తరహాలో కాంగ్రెస్ పార్టీ నుంచి వాటా ఇస్తారా? అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఇస్తారా? చెప్పాలంటున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలను వాడుకుని లబ్ధిపొందడం కోసమే ఈ నాటకం ఆడుతున్నారంటున్నారు. అదే 42 శాతం రిజర్వేషన్‌కు చట్టబద్ధత కల్పిస్తే అసెంబ్లీ నుంచి పార్లమెంట్ దాకా మాకు రావాల్సిన వాటా వస్తుందంటున్నారు. జనగణన ఇంటింటి సర్వే తప్పుల తడకగా ఉన్నందుకే రిజర్వేషన్ విషయంపై ధైర్యం చేయలేకపోతుందని ఆరోపిస్తున్నారు. ఈ తప్పుడు లెక్కలే ప్రామాణికమని చెప్పకనే చెప్పుకుంటూ.. బీసీల నుంచి వ్యతిరేకత రాకుండా తప్పించుకునేందుకే కేంద్రంపైకి నెపం నెడుతున్నారని అభిప్రాయపడుతున్నారు. ఈ కులగణన లెక్కలు, అసెంబ్లీ తీర్మానాలను బీసీలెవరూ హర్షించడం లేదంటున్నారు. అమలు సాధ్యం కాని హామీలిచ్చి గద్దెనెక్కిన కాంగ్రెస్ బీసీలకు అన్యాయం చేయాలని చూస్తే ఊరుకునేదే లేదని బీసీ సంఘాలు, నాయకులు హెచ్చరిస్తున్నారు.

## బలహీనవర్గాలను అణగదొక్కే కుట్ర..

నిర్మల్, ఫిబ్రవరి 5(నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన కుల గణన సర్వే అసమగ్రంగా ఉంది. హడావుడిగా సర్వే పూర్తి చేసి తప్పుల తడకగా నివేదిక రూపొందించారు. బలహీన వర్గాలను అణగదొక్కేందుకు ప్రభుత్వంలోని కొందరు పెద్దలు కుట్రకు తెరలేపారు. 2014లో కేసీఆర్ ప్రభుత్వం నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వే ప్రకారం 52 శాతం బీసీలు ఉన్నట్లు నిర్ధారణ కాగా, ఇప్పుడు 46 శాతమే ఉన్నట్లు ప్రభుత్వం వెల్లడించడం దారుణం. రోజు రోజుకు జనాభా పెరుగుతుంది. కానీ.. తగ్గదు కదా. ఎన్నికలకు ముందు ఓట్ల కోసం 42 శాతం బీసీ కోటా ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ నాయకులు, ఇప్పుడు ఎత్తేసేందుకు యత్నించడం శోచనీయం. ఇదీ ముమ్మాటికీ బీసీలను మోసం చేయడమే. నకిలీ గాంధీలను తీసుకొచ్చి ఆర్భాటంగా ప్రకటించిన కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌ను రేవంత్‌రెడ్డి తుంగలో తొక్కారు. జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు ఇవ్వకపోతే బీసీలకు రాజకీయాల్లో అవకాశాలు తగ్గిపోతాయి. రాజకీయాల్లో ఏ కులాలకైతే స్థానం ఉండదో ఆయా జాతులు అంతరించిపోయే అవకాశం ఉందని ఆనాడే అంబేద్కర్ చెప్పారు. రాజకీయ పదవుల్లో ఉంటే వారు తమ జాతిని రక్షించుకునేందుకు పాటు పడుతారు. ఆర్థిక పరంగా విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, నిధుల కేటాయింపు వారి కులాలకు కేటాయించుకునే వెసులుబాటు ఉంటుంది. కొన్ని కులాలకు వారి జనాభా 7 శాతం ఉంటే 7 శాతం రిజర్వేషన్లు కల్పించారు. మరి 56 శాతం ఉన్న బీసీలకు ఎందుకు ఇవ్వరు? అని ప్రశ్నించారు. బీసీల అభివృద్ధిపై కాంగ్రెస్ నాయకులకు చిత్తశుద్ధి ఉంటే మళ్లీ సర్వే నిర్వహించి వాస్తవాలను బయటపెట్టాలి. ఇస్తామన్న రిజర్వేషన్లు ఇవ్వకుండా తగ్గించే కుట్రలకు పాల్పడితే రేవంత్‌రెడ్డి బీసీల ఆగ్రహానికి గురికాక తప్పదు.

**- కిరణ్ కొమ్రేవార్, బీఆర్ఎస్ ముథోల్ నియోజకవర్గ సమన్వయకర్త.**

## బీసీలను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం



మంచిర్యాలటౌన్, ఫిబ్రవరి 5: కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ జన గణన పేరిట బీసీ వర్గాలను మోసం చేసింది. పూర్తిస్థాయిలో సర్వేచేయకుండానే కుల గణన పూర్తయిందని చెప్పడం విడ్డూరంగా ఉంది. కుల గణనలో తప్పుల తడకగా ఉంది. కేవలం 42 శాతం మాత్రమే బీసీలు ఉన్నట్లు పేర్కొనడం వెనక ఆంతర్యం ఏమిటన్నది అర్థం కావడం లేదు. దాదాపు 52 శాతం బీసీలు, ముస్లిం బీసీల జనాభా దాదాపు 10శాతం కలుపుకుని రాష్ట్రంలో మొత్తం బీసీ జనాభా 60 శాతానికి పైగా ఉంటుంది. కానీ ప్రభుత్వం అసెంబ్లీలో చెప్పిన లెక్కల ప్రకారం బీసీ జనాభా భారీగా తగ్గిందని, ఓసీ జనాభా పెరిగిందని చూపించారు. దీనిపై ప్రజానీకం అనుమానాలు వ్యక్తం చేస్తున్నది. ఇప్పటికైనా ప్రభుత్వం పారదర్శకంగా సర్వేను నిర్వహించి ప్రజలకు వివరాలను వెల్లడించాలి. ఎన్నికలకు ముందు బీసీ రిజర్వేషన్లను అమలు చేస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు రిజర్వేషన్ల అంశాన్ని కేంద్ర ప్రభుత్వం చేతిలోకి నెట్టి తప్పించుకోవాలని చూస్తున్నది. బీఆర్ఎస్ చేపట్టిన ఇంటింటి సర్వేను పక్కన పెట్టి కొత్తగా సర్వే చేశామని చెప్పి బీసీ ప్రజలను మళ్లీ మోసం చేయాలని చూస్తున్నది.

**- పెంట రాజయ్య, మున్సిపల్ మాజీ చైర్మన్, మంచిర్యాల**



బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌తో కలిసి కేటీఆర్‌ను కలిసిన బజార్‌హత్నూర్ బీఆర్ఎస్ పార్టీ మండల నాయకులు

# కేటీఆర్‌ను కలిసిన ఎమ్మెల్యే

బజార్‌హత్నూర్, ఫిబ్రవరి 5 : హైదరాబాద్‌లోని కేటీఆర్ నివాసంలో బుధవారం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌తో కలిసి బీఆర్ఎస్ బజార్‌హత్నూర్ సీనియర్ నాయకుడు చిలుకూరి భూమయ్య మాజీ మంత్రి కేటీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీని ముందంజలో నడిపించాలని, అందరు కలిసి కట్టుగా పనిచేసి మన పార్టీ అభ్యర్థులను గెలిపించాలని సూచించారు. అదేవిధంగా మాయమాటలు చెప్పి ప్రజలను మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వ తీరును ప్రజల్లోకి తీసుకెళ్లాలని పేర్కొన్నారు. వీరితోపాటు నాయకులు సాయికృష్ణ, శరత్‌కృష్ణ ఉన్నారు.

# సౌకర్యాలు కల్పించాలి..

**పోస్టుకార్డులను పంపిన కాలనీవాసులు**

ఎదులాపురం, ఫిబ్రవరి 5 : మావల శివారులోని సర్వే నంబర్ 170 పరిధిలో గల కుమ్రం భీం కాలనీవాసులకు సౌకర్యాలు కల్పించాలని తుడుందెబ్బ రాష్ట్ర కో-కన్వీనర్ గోడం గణేశ్ డిమాండ్ చేశారు. బుధవారం కాలనీ నుంచి హెడ్ పోస్టాఫీసు వరకు పాదయాత్రగా వచ్చారు. ఇక్కడి నుంచి ప్రెసిడెంట్ ఆఫ్ ఇండియా, ప్రధాన మంత్రి, ఎస్టీ కమిషన్, తెలంగాణ గవర్నర్, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, తెలంగాణ సీఎంలకు పోస్టు కార్డులను పంపించారు. సమస్యలను వివరిస్తూ.. పరిష్కరించేలా చూడాలని కార్డు ద్వారా కోరారు. ఈ సందర్భంగా గణేశ్ మాట్లాడుతూ.. పట్టణంలో అడవి బిడ్డలు ఆవాసం ఏర్పాటు చేసుకున్నారన్నారు. పాలకులు, అధికారులు వారికి సౌకర్యాలు కల్పించడం లేదన్నారు. ఏడు దశాబ్దాల నుంచి అక్కడే గుడిసెలు వేసుకుని ఉంటున్నా తమను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. పిల్లల భవిష్యత్ కోసం ఆదివాసులకు ఇండ్ల పట్టాలతోపాటు రోడ్డు, విద్యుత్, విద్య, తాగు నీరు వంటి సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఎండ్లుగా పోరాడం చేస్తున్న సమస్యను పరిష్కరించడం లేదన్నారు. అందుకే పోస్టు కార్డుల ద్వారా తమ సమస్యలను తెలిపామని వివరించారు. ఈ కార్యక్రమంలో వెట్టి మనోజ్, దాదిరావ్, సుబన్, రేణుక, వరుణ్, ఇంద్ర, సంతోష్, భజంగ్‌రావ్ పాల్గొన్నారు.



పోస్టు కార్డులు పంపిస్తున్న కాలనీవాసులు



రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న మాల సంక్షేమ సంఘం నాయకులు

# సీఎం తీరును నిరసిస్తూ నిరసన

ఎదులాపురం, ఫిబ్రవరి 5 : రాజ్యాంగంలోని 341 ఆర్టికల్ ప్రకారం వర్గీకరణ చేయాలని తాము చెప్పిన వినకుండా.. ఏకపక్షంగా అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి ఓ వర్గానికి వత్తాసు పలికేలా బిల్లును ఆమోదించడం సరైంది కాదని మాల సంక్షేమ సంఘం అధ్యక్షుడు కొప్పుల రమేశ్ అన్నారు. బుధవారం ఆ సంఘం ఆధ్వర్యంలో సీఎం కలెక్టర్ చౌక్‌లో నిరసన తెలిపారు. అనంతరం సీఎం ఫ్లెక్సీని దహనం చేసేందుకు యత్నించగా పోలీసులు లాక్కున్నారు. దీంతో వారి మధ్య తోపులాట జరగడంతో కొంత ఉద్రిక్తత నెలకున్నది. అనంతరం రోడ్డుపై బైఠాయించి సీఎంకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు సుధాకర్, మేకల మల్లన్న, అశోక్, రాజేశ్వర్, మెట్టు ప్రహ్లాద్, జగదీశ్, రమేశ్, ప్రదీప్, భూమన్న, ఊశన్న, లింగన్న పాల్గొన్నారు.

# పరిపాలన సౌలభ్యం కోసమే మండలాలు

**ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా**

జైనథ్, ఫిబ్రవరి 5: రాష్ట్రంలో పరిపాలన సౌలభ్యం కోసమే నూతన మండలాల ఏర్పాటు చేశామని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. ప్రభుత్వం మండలాల ఏర్పాటుకు ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా బుధవారం భోరజ్, సాత్నాల నూతన మండలాలకు సంబంధించిన తహసీల్దార్, ఎంపీడీవో ప్రభుత్వ కార్యాలయాలను కలెక్టర్ రాజర్షి షా ప్రారంభించారు. ఈ సందర్భంగా భోరజ్‌కు వచ్చిన కలెక్టర్‌ను పూలవర్షంతోపాటు డప్పుచప్పుళ్ల మధ్య ప్రజలు, అధికారులు స్వాగతం పలికారు. భోరజ్ తహసీల్దార్‌గా రాథోడ్ రాజేశ్వరి, భోరజ్ మండల ఎంపీడీవోగా వేణు, సాత్నాల మండల తహసీల్దార్‌గా మడావి విశ్వనాథ్, ఎంపీడీవోగా వెంకట్‌రాజ్‌లు కలెక్టర్ సమక్షంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ శ్యామలదేవి, అసిస్టెంట్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వీయ, ఆదిలాబాద్ ఆర్డీవో వినోద్ కుమార్, జడ్పీ సీఈవో జితేందర్‌రెడ్డి, కలెక్టరేట్ సూపరింటెండెంట్ రాంరెడ్డి పాల్గొన్నారు.



భోరజ్‌లో డప్పు చప్పుళ్లతో కలెక్టర్‌కు స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు

### నులి పురుగుల నిర్మూలన దినోత్సవాన్ని సక్సెస్ చేయండి

ఎదులాపురం, ఫిబ్రవరి 5 : జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవాన్ని విజయవంతం చేయాలని, ఆరోగ్యవంతమైన పిల్లల కోసం ఆల్బెండజోల్ మాత్రలను వేయించాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. బుధవారం కలెక్టర్ సమావేశ మందిరంలో వివిధ శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవాన్ని ఈనెల నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. 1-19 సంవత్సరాల వయస్సు ఉన్న పిల్లలందరికీ ఆల్బెండజోల్ మాత్రలను కళాశాలలు, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల వద్ద ఉచితంగా వేస్తారన్నారు. 10 తేదీన తప్పిపోయిన పిల్లలకు ఈనెల 17వ తేదీన ఇస్తారన్నారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి నరేందర్ రాథోడ్, డీఐవో వైసీ శ్రీనివాస్, డీఈవో ప్రణీత, డిప్యూటీ డీఎంహెచ్‌వో సాధన, అడిషనల్ డీఎంహెచ్‌వో డాక్టర్ గజనన్ పాల్గొన్నారు.

### పుస్తకాలతో ఆలోచన శక్తి పెరుగుతుంది

పుస్తకాలు చదవడంతో జ్ఞానంతోపాటు ఆలోచన శక్తి పెరుగుతుందని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని గర్ల్స్ హైస్కూల్‌లో నేషనల్ బుక్ ట్రస్ట్ ఇండియా ఆధ్వర్యంలో మొబైల్ పుస్తక పరిశ్రమ వ్యాన్‌ను ఏర్పాటు చేశారు. కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం అందులోని పుస్తకాలను పరిశీలించి అభినందించారు. అదేవిధంగా ఎన్ఆర్ఐ వాసుల తరపున పాఠశాలలో ఏర్పాటు చేసిన లైబ్రరీని కూడా కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జ్ఞానం, ఆలోచన శక్తి పెరగాలంటే నిత్యం పుస్తకాలు చదవాలన్నారు. మహనీయులు, స్వాతంత్ర్య సమరయోధుల జీవిత చరిత్రలను చదవాలని సూచించారు. నేషనల్ బుక్ ట్రస్ట్ ఇండియా నాలుగు రోజులపాటు పుస్తక ప్రదర్శనతోపాటు అమ్మకాలు చేపడుతుందన్నారు. డీఈవో ప్రణీత, ఎంఈవో సోమయ్య, లక్ష్మీపూర్ హెచ్ఎం కోరెడ్డి అశోక్, హెచ్ఎం రమేశ్ రెడ్డి, సెక్టోరియల్ అధికారి సుజాత్ ఖాన్ పాల్గొన్నారు.

# నల్ల చట్టాలను రద్దు చేయాలని ధర్నా

ఎదులాపురం, ఫిబ్రవరి 5 : కేంద్ర ప్రభుత్వం కార్మిక, రైతులకు వ్యతిరేకంగా తీసుకొచ్చిన నల్ల చట్టాలను రద్దు చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సిర్ర దేవేందర్ డిమాండ్ చేశారు. కార్మిక చట్టాల నిర్వీర్యం, వ్యవసాయ నల్ల చట్టాలను రద్దు చేయాలని, కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి, ఆదిలాబాద్ జిల్లాకు జరిగిన అన్యాయంపై బుధవారం కలెక్టరేట్ ఎదుట కేంద్ర కార్మిక, రైతు సంఘాల ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ ధర్నాలో ఆయా సంఘాల నాయకులు అగ్గిమల్ల స్వామి, పోశెట్టి, జగన్ సింగ్, చిలక దేవిదాస్, అశోక్, వెంకట నారాయణ పాల్గొన్నారు.



ఆదిలాబాద్ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న వివిధ సంఘాల నాయకులు